



Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

సోమవారం 23-11-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :154 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

మహా పాదయాత్రతో చరిత్ర సృష్టిస్తాం!

- కరీంనగర్‌లో బీజేపీ మహా పాదయాత్ర
- దేశవ్యాప్తంగా చరిత్ర సృష్టిస్తుందన్న బండి సంజయ్
- ఎస్ఐఆర్‌కు వ్యతిరేకులపై ఘాటు వ్యాఖ్యలు
- అక్రమ ఓట్ల తొలగింపే ఎస్ఐఆర్ లక్ష్యం
- యాత్రకు నితిన్ నబిన్ హాజరు
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై బండి సంజయ్ విమర్శలు
- తెలంగాణలో బీజేపీదే అధికారం
- సిక్కు సమాజానికి అండగా ఉంటామని హామీ


2 లో

న్యూస్ డెస్క్, 22 నవంబర్ (ఇది కద నిజం): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు మద్దతుగా కరీంనగర్‌లో నిర్వహించనున్న 'మహా పాదయాత్ర' దేశవ్యాప్తంగా చరిత్ర సృష్టించబోతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పేర్కొన్నారు. ఎస్ఐఆర్‌ను అడ్డుకునే వారంతా దేశద్రోహులేనంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విదేశీ అక్రమ చొరబాటుదారులకు ఓటు హక్కు కల్పించాలని కోరుకునే వారు మూర్ఖులు అని మండిపడ్డారు. తెలంగాణలో వచ్చేది బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్‌లోని గురుద్వారా వద్ద ఎంపీ లాడ్స్ నిధులతో ఏర్పాటు చేసిన 11 కేవీ సోలార్ ప్యానెల్‌ను ఆదివారం బండి సంజయ్ ప్రారంభించారు.

గతంలో గురుద్వారాకు నెలకు సుమారు రూ.25 వేల విద్యుత్ బిల్లు వచ్చేదని..

మరో చెరువు పునరుద్ధరణకు హైడ్రా శ్రీకారం!

- 3 ఎకరాల నుంచి 12 ఎకరాలకు చెరువు విస్తరణ
- చెరువు లోతు పెంచి వరదనీటి నిల్వకు ఏర్పాట్లు
- జూబ్లీహిల్స్, వెంకటగిరి వరదనీరు చెరువుకు మళ్లింపు
- లోతట్టు ప్రాంతాలకు వరద ముప్పు తగ్గించే ప్రణాళిక
- పార్కులో సమస్యలను కమిషనర్‌కు వివరించిన వాకర్స్
- చెత్త డంపింగ్, పాడైన జిమ్ పరికరాలపై ఫిర్యాదులు
- ఆధునిక ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

2 లో

బంగాళాఖాతంలో మళ్లీ అలజడి!

- బంగాళాఖాతంలో మరో వాతావరణ ముప్పు
- నవంబర్ చివర్లో కొత్త ఉపరితల ఆవర్తనం
- అండమాన్ సముద్రంలో వాతావరణ మార్పులు
- ఆవర్తనం తీవ్రతపై ఇంకా స్పష్టత లేదు
- తదుపరి బులెటిన్లను గమనించాలని ఐఎండీ సూచన
- ఈ ఏడాది ఇప్పటికే మూడు తుఫాన్లు
- ఎల్ నినోతో తుఫాన్ల ప్రభావం?

2 లో

నగరాలపై అభివృద్ధి అస్త్రం!



- పట్టణాభివృద్ధి ప్రాజెక్టులపై సీఎం ప్రత్యేక సమీక్ష
- ఎలివేటెడ్ కారిడార్లు, రేడియల్ రోడ్లపై ఫోకస్
- భారీ ప్రాజెక్టులకు వేల కోట్ల నిధుల సమీకరణ
- బాండ్లు, రుణాలు.. హెచ్ఎండీఏ ఆర్థిక ప్రణాళిక
- ట్రాఫిక్, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి కార్యాచరణ
- మెట్రో విస్తరణ, భూసేకరణ పనులపై సమీక్ష
- తాగునీటి సరఫరా, ఎస్టీపీల నిర్వహణపై ఆరా
- చెరువుల అభివృద్ధి, నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి

న్యూస్ డెస్క్, 22 నవంబర్ (ఇది కద నిజం): మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మున్సిపల్ పరిపాలన శాఖపై శుక్రవారం సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి పట్టణాభివృద్ధి శాఖపై సోమవారం సమీక్ష నిర్వహించనున్నారు. కోర్ అర్బన్ రేజియన్, పెరి అర్బన్ రీజియన్లలో చేపట్టనున్న మౌలిక వసతుల ప్రాజెక్టులపై చర్చించనున్నారు. హెచ్ఎండీఏ, ఎంఆర్డీసీఎల్, మెట్రోరైలు ప్రాజెక్టు, జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ, డీటీసీపీ, పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగాల్లో చేపడుతున్న పనులపై చర్చించనున్నారు. ఎంఏయూడీ సెక్రెటరీగా సర్ఫరాజ్ అహ్మద్ బాధ్యతలు చేపట్టిన మొదటి సమీక్షా సమావేశంతో అన్ని విభాగాలకు సంబంధించిన ప్రోగ్రెస్ రిపోర్టు తయారు చేస్తున్నట్టు సమాచారం.

హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో..

రహదారులు, ఎలివేటెడ్ కారిడార్లు, రేడియల్ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) వాటిని సకాలంలో పూర్తి చేసేందుకు రుణాల సమీకరణపై దృష్టి సారిస్తోంది. బాండ్ల జారీ, ఇతర ఆర్థిక సంస్థల ద్వారా రుణాలు, భూముల వేలం ద్వారా నిధులు సమకూర్చుకునే అంశాలపై కసరత్తు చేస్తోంది. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో రూ.5,106 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం, రూ.4,030 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నుంచి రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) వరకు గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. బంజారాహిల్స్ ఐసీసీసీ నుంచి శిల్పా లేఅవుట్ వరకు రూ.1,656 కోట్లతో మరో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాన్ని చేపడుతున్నారు. బుద్వేల్ నుంచి నాచారం వరకు సుమారు 81.15 కిలోమీటర్ల పొడవున రేడియల్ రోడ్డు నిర్మాణానికి దాదాపు రూ.5 వేల కోట్ల వ్యయంతో ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రాజెక్టు పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

మిగతాది 2 లో..

13 ఏళ్ల తర్వాత కొత్త పీఏసీఎస్‌లు!

- 13 ఏళ్ల తర్వాత కొత్త పీఏసీఎస్‌ల ఏర్పాటు
- తెలంగాణలో 240 సహకార సంఘాలకు గ్రీన్ సిగ్నల్
- హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో కొత్త సంఘాలు
- వచ్చే జనవరిలో ప్రారంభించేందుకు ప్రభుత్వ లక్ష్యం
- నల్గొండ జిల్లాకు అత్యధికంగా 23 సంఘాలు
- మేడ్చల్ జిల్లాలో ఒక్క సంఘానికే అనుమతి
- గ్రామీణ సహకార వ్యవస్థ బలోపేతమే లక్ష్యం



2 లో

న్యూస్ డెస్క్, 22 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దాదాపు 13 ఏళ్ల విరామం తర్వాత కొత్త సహకార సంఘాల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసింది. హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల్లో కొత్తగా 240 పీఏసీఎస్‌లను ప్రారంభించేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. వచ్చే జనవరిలో కొత్త సంఘాలను ప్రారంభించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 908 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉండగా.. వీటన్నింటినీ 2013కు ముందే ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కొత్త సంఘాల ఏర్పాటు జరగలేదు.

పాక్ స్మగ్లింగ్ కుట్ర భగ్నం!


2 లో

న్యూస్ డెస్క్, 22 నవంబర్ (ఇది కద నిజం): భారత్–పాకిస్థాన్ సరిహద్దుల్లో డ్రగ్స్, ఆయుధాల అక్రమ రవాణాకు పాల్పడుతున్న దాయాద పాకిస్తాన్ కుట్రలను భద్రతా దళాలు మరోసారి భగ్నం చేశాయి. ఆదివారం ఉదయం పంజాబ్‌లోని తరన్ తారన్ జిల్లా, ఖల్రా సెక్టార్ పరిధిలోని కల్సియన్ గ్రామ సమీపంలో సరిహద్దు భద్రతా దళం, పంజాబ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో భారీగా ఆయుధాలు, మత్తు పదార్థాలు పట్టుబడ్డాయి.

బీఆర్ఎస్‌లో అవమానాలు.. ఒక్కొక్కటి బయటపెట్టిన కవిత!

- క్యాన్సర్ పేరుతో ఫేక్ ప్రచారం?
- కేటీఆర్ టీమ్‌పై కవిత ఫైర్
- బీఆర్ఎస్‌లో అవమానాలంటూ ఆరోపణ
- కార్యకర్తల సస్పెన్షన్‌పై ఆవేదన
- కేసీఆర్‌పై కవిత అసంతృప్తి
- భర్త ఫోన్ ట్యాపింగ్‌పై ఆగ్రహం
- కేటీఆర్ ల్యాప్‌టాప్‌పై కవిత ప్రశ్నలు


2 లో

న్యూస్ డెస్క్, 22 నవంబర్ (ఇది కద నిజం): తనకు క్యాన్సర్ ఉందని, త్వరలోనే చనిపోతానంటూ 2019లో బీఆర్ఎస్ సోషల్ మీడియా వేదికగా తనపై తప్పుడు ప్రచారం చేయించారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. రాజకీయంగా తనను ఎదుర్కోలేక వ్యక్తిగతంగా టార్గెట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేటీఆర్ ఆధ్వర్యంలో నడిచిన బీఆర్ఎస్ సోషల్ మీడియా తనపై అసభ్యకరమైన వ్యాఖ్యలు, నిరాధార ప్రచారాలు చేయించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కవిత బీఆర్ఎస్‌లో తనకు ఎదురైన అవమానాలు, వివక్షపై పలు కీలక విషయాలు వెల్లడించారు.

గ్రామాల్లో ఏకగ్రీవాలే లక్ష్యం.. చంద్రబాబు పిలుపు!



- పంచాయతీ ఎన్నికలపై చంద్రబాబు దిశానిర్దేశం
- ఏకగ్రీవ పంచాయతీలకు భారీ నజరానా
- రూ.15 – రూ.50 లక్షల వరకు ప్రోత్సాహకం
- గత ఎన్నికల విజయంపై చంద్రబాబు ప్రశంస
- ఏకగ్రీవాల ప్రోత్సాహకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- నేతల మధ్య ఈగోలకు చెక్
- కలిసికట్టుగా పనిచేయాలని నేతలకు పిలుపు

2 లో

బంగ్లాదేశ్‌లో బీభత్సం.. 30 ఇళ్లకు నిప్పు!


2 లో

- బంగ్లాదేశ్‌లో మళ్లీ తీవ్రరూపం దాల్చిన రాజకీయ హింస
- అవామీ లీగ్ నేతలు, కార్యకర్తల ఆస్తులే లక్ష్యంగా దాడులు
- నరైల్ జిల్లాలోని బెందార్చార్ గ్రామంలో విధ్వంసం
- నిరసనకారుల దాడుల్లో దాదాపు 30 ఇళ్లు దగ్ధం
- ఇళ్లు, దుకాణాలను ధ్వంసం చేసి భారీగా లూటీ
- మాజీ ఎంపీ, మాజీ మేయర్ నివాసాలపైనా దాడులు
- అర్ధరాత్రి వరకు కొనసాగిన దాడులతో స్థానికుల్లో భయాందోళనలు
- సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు భద్రతా బలగాల మోహరింపు

వచ్చే ఎన్నికల్లో భారీ గెలుపే లక్ష్యం!

- భారీ మెజారిటీ కోసం సందీప్ పిలుపు
- కష్టపడిన కార్యకర్తలకు పదవుల హామీ
- సంక్రాంతి తర్వాత ఐదు నెలల 'ప్రజా బలం'
- 'సర్' పేరుతో ఓట్ల తొలగింపుపై ఫైర్
- తెలంగాణకు రూ.30 వేలకోట్లు కోరుతూ తీర్మానం
- రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం
- గ్రామాల్లోకి వెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపు


2 లో

న్యూస్ డెస్క్, 22 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, రాబోయే ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించడమే లక్ష్యంగా పార్టీ నేతలు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ నూతన ఇన్‌చార్జి బీఎం సందీప్ కుమార్ పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో సమష్టి కృషితోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, అదే స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో మరింత ఎక్కువ స్థానాలు సాధించాలని సందీప్ కుమార్ సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఇద్దరు నేతలు పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు.

కష్టపడిన వారందరికీ పదవులు..

పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు సముచిత గుర్తింపు, పదవులు కల్పిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే అనేక మందికి పదవులు ఇచ్చామని, రాబోయే రోజుల్లో మరిన్ని అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ పని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. సంక్రాంతి తర్వాత ఐదు నెలల పాటు 'ప్రజా బలం' కార్యక్రమాన్ని చేపట్టి పార్టీ నాయకులందరూ గ్రామాలకు వెళ్లి ప్రజలకు చేరువ కావాలని దిశానిర్దేశం చేశారు.

గత ఎన్నికల్లో సమిష్టిగా పనిచేసి తెలంగాణలో 64 ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకున్నామని, ఆ తర్వాత ఉప ఎన్నికల్లోనూ విజయాలు సాధించామని ఏఐసీసీ ఇన్‌చార్జి బీఎం సందీప్ కుమార్ గుర్తుచేశారు.

దీపం వివాదంపై సుప్రీంకోర్టుకు తమిళనాడు!

- తిరుప్పరంకుండ్రం దీపంపై మరో ట్విస్ట్
- సుప్రీంకోర్టులో తమిళనాడు రివ్యూ పిటిషన్
- దీపంవెలిగింపుపై ఉత్తర్వుల సమీక్ష కోరిన ప్రభుత్వం
- నవంబర్ 24 అనుమతిపై అభ్యంతరం
- ఆలయ సంప్రదాయాలకే ప్రాధాన్యమంటూ వాదన
- రాతి స్తంభం వద్ద దీపంపై వివాదం
- శాంతిభద్రతల సమస్యలపై ప్రభుత్వ ఆందోళన

2 లో

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
సోమవారం 23-11-2026

వచ్చే ఎన్నికల్లో భారీ గెలుపే లక్ష్యం!

మొదటి పేజీ తరువాయి

గత ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ హయాంలో పంచాయతీ ఎన్నికల్లో 66 శాతం, మున్సిపల్ ఎన్నికల్లో 85 శాతం విజయాలు సాధించామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో మరింత భారీ మెజారిటీతో ఎక్కువ స్థానాలు గెలుచుకునేలా పార్టీ నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సందీప్ కుమార్ పిలుపునిచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని అన్నారు.

'సర్' పేరుతో ఓట్ల తొలగింపు కుట్ర..

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. అర్హులకు ఓటు హక్కు కల్పించాల్సిన ప్రక్రియను ఓట్ల తొలగింపునకు ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 'సర్' పేరుతో 20 కోట్ల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని, ఇప్పటికే 13 కోట్ల ఓట్లను తొలగించారని మండిపడ్డారు. తెలంగాణలోనూ 71 లక్షల ఓట్లను పక్కన పెట్టారని ఆరోపించారు. వలసల పేరుతో దళితులు, ఆదివాసీలు, గిరిజనులు, మహిళల ఓట్లను తొలగిస్తూ వారిని ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. 'సైమన్ గో బ్యాక్' తరహాలో 'జ్ఞానేష్ కుమార్ గో బ్యాక్' నినాదంతో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి ఓటర్ల హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

కేంద్ర సహకారం లేకున్నా సంక్షేమం..

ఎల్‌నినో ప్రభావంతో దేశంలోని పలు ప్రాంతాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నప్పటికీ తెలంగాణలో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సందీప్ కుమార్ తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి తగిన సహకారం అందించడం లేదని విమర్శించారు. రాబోయే ఎనిమిది నెలల పాటు ప్రజలకు తాగునీరు అందించాల్సి ఉన్నందున ప్రాజెక్టుల నీటిని తాగునీటి అవసరాలకే వినియోగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణకు రూ.30 వేల కోట్ల ఆర్థిక సాయం అందించాలని కేంద్రాన్ని కోరుతూ పీఏసీలో తీర్మానం చేయాలని సూచించారు.

రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం..

రాబోయే ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు కష్టపడాలని సందీప్ కుమార్ పిలుపునిచ్చారు. సోనియా గాంధీ చేసిన త్యాగాలు, మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల బలిదానాలు దేశ ప్రజల మనసుల్లో నిలిచిపోయాయని పేర్కొన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని రాజకీయంగా ఎదుర్కొంటూ కాంగ్రెస్ తిరిగి దేశంలో అధికారంలోకి వచ్చేలా నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. అలాగే 2027 జనగణనలో ఓబీసీ కులగణన చేపట్టాలని కోరుతూ ప్రధానికి లేఖ రాయాలని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు సీఎం సూచించారు.

బీఆర్ఎస్‌లో అవమానాలు.. ఒక్కొక్కటి బయటపెట్టిన కవిత!

మొదటి పేజీ తరువాయి

తన గురించి తెలియని వ్యక్తులు ఇలాంటి ప్రచారం చేస్తే పట్టించుకోవాల్సిన అవసరం లేదని, కానీ తన గురించి పూర్తిగా తెలిసిన వారే ఇలా చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ కూతురిగా, కేటీఆర్ సోదరిగా ఉన్న తనపైనే ఒక మహిళపై ఎవరూ చేయనంత అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయించారని మండిపడ్డారు. వారి మానసిక పరిస్థితి ఏంటో ప్రజలే అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించారు.

బయటకు చెప్పే టైమ్ వచ్చింది:

తనపై కోపంతో పార్టీ కార్యకర్తలను కూడా ఇబ్బందులకు గురిచేశారని కవిత ఆరోపించారు. తన దగ్గరకు వచ్చి మాట్లాడినా, తనతో ఫొటోలు దిగినా కార్యకర్తలను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని చెప్పారు. 2014 నుంచి తన పట్ల ఇదే తరహా వివక్ష కొనసాగిందని వెల్లడించారు. నిజామాబాద్‌లోని బోధన్ షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలని కేసీఆర్‌ను ఎన్నోసార్లు కోరినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను తీసుకెళ్లి ఫ్యాక్టరీని ప్రారంభించాలని విజ్ఞప్తి చేసినా స్పందన లేదన్నారు. తన నియోజకవర్గానికి సంబంధించిన పనుల విషయంలోనూ వివక్ష చూపించారని, సీఎం రిలీఫ్ ఫండ్ కోసం తన పేరు మీద లేఖ పంపిస్తే లక్షల రూపాయల ఖర్చుతో వచ్చే సాయం కేవలం రూ.60 వేలు మాత్రమేనని కవిత వ్యాఖ్యానించారు. కొన్ని విషయాలు చెప్పుకుంటే చిల్లరగా ఉంటాయని కానీ ఇప్పుడు చెప్పుకునే టైమ్ వచ్చిందన్నారు.

కేటీఆర్ ల్యాప్ టాప్ ఎందుకు ఇవ్వరు?

రాజకీయాల్లో ఉన్న తన ఫోన్ ట్యాప్ చేసినా అర్థం చేసుకోగలనని, కానీ రాజకీయాలతో సంబంధం లేని తన భర్త ఫోన్‌ను కూడా ట్యాప్ చేయడం బాధించిందని అన్నారు. తనను కేవలం కేసీఆర్ బిడ్డగా కాకుండా ఒక రాజకీయ నాయకురాలిగా చూడాలని కవిత కోరారు. 2007లోనే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి వ్యతిరేకంగా బతుకమ్మను ఎత్తుకొని ఉద్యమాలు చేశానని గుర్తుచేశారు. లిక్కర్ స్కామ్ కేసులో తనపై ఆరోపణలు వచ్చినప్పుడు తాను ఉపయోగించిన 11 సెల్‌ఫోన్లను బహిరంగంగా చూపించి దర్యాప్తు సంస్థలకు అప్పగించానని కవిత గుర్తుచేశారు. తన పదేళ్ల రాజకీయ జీవితంలో ఉపయోగించిన ఫోన్లన్నింటినీ ఇచ్చానని, దర్యాప్తు సంస్థలు అడగకపోయినా పారదర్శకంగా వ్యవహరించానని చెప్పారు. అయితే కేటీఆర్‌ను ల్యాప్‌టాప్ ఇవ్వాలని అడిగితే ఆయన కోర్టుకు వెళ్లారని ఆరోపించారు. ల్యాప్‌టాప్ ఇవ్వకుండా ఎందుకు దాచిపెట్టారని కేటీఆర్‌ను ప్రశ్నించాలని అన్నారు.

పాక్ స్మగ్లింగ్ కుట్ర భగ్నం!

మొదటి పేజీ తరువాయి

సరిహద్దు ప్రాంతంలో అనుమానాస్పద కదలికల నేపథ్యంలో బీఎస్ఎఫ్, పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో కల్సియన్ గ్రామ పరిసరాల్లో డ్రోన్ ద్వారా జారవిడిచిన ఓ అనుమానాస్పద ప్యాకెట్‌ను భద్రతా సిబ్బంది గుర్తించారు. దానిని తెరిచి చూడగా అందులో నాలుగు పిస్టల్స్, ఆరు మ్యాగజైన్లు, 57 లైవ్ బుల్లెట్స్‌తో పాటు 277 గ్రాముల హెరాయిన్ లభ్యమయ్యాయి. పాక్ భూభాగం నుంచే డ్రోన్ ద్వారా ఈ సరుకును భారత్‌లోకి పంపినట్లుగా ప్రాథమిక విచారణలో అధికారులు నిర్ధారించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేశారు. సరిహద్దు వెంబడి ఈ డ్రోన్ డ్రాపింగ్ వెనుక ఉన్న స్మగ్లర్ల ముఠా ఆచూకీ కోసం పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో ఏకగ్రీవాలే లక్ష్యం.. చంద్రబాబు పిలుపు!

న్యూస్ డెస్క్, 22 నవంబర్ (ఇది కద నిజం): స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు, రాబోయే పంచాయతీ ఎన్నికల వ్యూహంపై ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులు, తెలుగుదేశం పార్టీ ముఖ్యనేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి సాధించిన గెలుపు గత రెండున్నరేళ్ల పరిపాలనకు ప్రజలు ఇచ్చిన ఆమోదముద్రగా అభివర్ణించారు. పార్టీ గుర్తులపై జరిగిన ఈ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని, ఈ ఫలితాలు క్షేత్రస్థాయి ప్రజాభిప్రాయానికి అద్దం పట్టాయని పేర్కొన్నారు. అయితే.. ఏకపక్షంగా వచ్చిన ఈ ప్రజా తీర్పును ప్రతిపక్ష పార్టీ జీర్ణించుకోలేకపోతోందని ఆయన విమర్శించారు. గ్రామాల సమగ్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాలను ప్రోత్సహించాలని మంత్రులు, నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఏకగ్రీవమైన పంచాయతీలకు ప్రభుత్వం పెంచిన ప్రోత్సాహక నిధుల వివరాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. దీని ప్రకారం.. 5 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీ ఏకగ్రీవమైతే గతంలో రూ.5 లక్షలుగా ఉన్న నజరానాను ఇప్పుడు రూ.15 లక్షలకు పెంచినట్లు తెలిపారు. అలాగే.. 5 వేల నుంచి 10 వేల మధ్య జనాభా ఉంటే రూ.25 లక్షలు, 10 వేల పైన జనాభా ఉన్న పంచాయతీలకు గతంలో ఉన్న రూ.20 లక్షల ప్రోత్సాహకాన్ని ఏకంగా రూ.50 లక్షలకు పెంచిన విషయాన్ని ఆయన వివరించారు. ఇక పార్టీ అంతర్గత వ్యవహారాలపై స్పందిస్తూ.. నాయకుల మధ్య వ్యక్తిగత పంతాలు, ఈగోలు ఏమాత్రం సరికాదని చంద్రబాబు స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల స్ఫూర్తితో క్షేత్రస్థాయిలో అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

దీపం వివాదంపై సుప్రీంకోర్టుకు తమిళనాడు!



న్యూస్ డెస్క్, 22 నవంబర్ (ఇది కద నిజం): తమిళనాడులోని మధురై జిల్లాలో ఉన్న ప్రసిద్ధ తిరుప్పరంకుండ్రం కొండపై కార్తీక దీపం వెలిగించే అంశం మరోసారి సుప్రీంకోర్టుకు చేరింది. కొండపై వివాదాస్పదంగా ఉన్న రాతి స్తంభం వద్ద నవంబర్ 24న కార్తీక దీపం వెలిగించేందుకు ఒకసారి మినహాయింపుగా అనుమతినిస్తూ నవంబర్ 20న సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సమీక్షించాలని కోరుతూ తమిళనాడు ప్రభుత్వానికి చెందిన హిందూ మత, ధర్మాదాయ శాఖ కమిషనర్ సర్వోన్నత న్యాయస్థానంలో రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు.

పిటిషన్ దాఖలుకు కారణాలు ఇవే..

నవంబర్ 20న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై తమిళనాడు ప్రభుత్వం నవంబర్ 21వ తేదీ రాత్రి అత్యవసరంగా ఈ రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేసింది. మధురైలోని అరుల్మిగు సుబ్రమణ్య స్వామి ఆలయ సంప్రదాయం ప్రకారం ఏటా కొండ దిగువ భాగంలో ఉన్న ఉచ్చిపిళ్లయార్ ఆలయం సమీపంలోని 'దీప మండపం' వద్ద మాత్రమే కార్తీక దీపం వెలిగిస్తారని తమిళనాడు ప్రభుత్వం, ఆలయ అధికారులు మొదటి నుంచి వాదిస్తున్నారు. కొండపై ఉన్న దర్గాకు సుమారు 50 మీటర్ల దూరంలో ఉన్న రాతి స్తంభం వద్ద దీపం వెలిగించే సంప్రదాయం గతంలో ఎన్నడూ లేదని, బ్రిటిష్ కాలంలో సర్వే కోసం ఏర్పాటు చేసిన రాతి స్తంభాన్ని ఇప్పుడు 'దీపత్తూన్'గా పేర్కొనడం సరికాదని రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. శాంతిభద్రతల సమస్యలు, సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఆచారాలకు భంగం కలుగుతుందనే ఆందోళనతో ప్రభుత్వం ఈ ఉత్తర్వులపై పున: సమీక్ష కోరింది.

బంగ్లాదేశ్‌లో బీభత్సం.. 30 ఇళ్లకు నిప్పు!

న్యూస్ డెస్క్, 22 నవంబర్ (ఇది కద నిజం): బంగ్లాదేశ్‌లో రాజకీయ హింస మళ్లీ తీవ్రరూపం దాల్చింది. దేశంలోని పలు ప్రాంతాలకు ఈ హింసాత్మక ఘటనలు విస్తరిస్తుండగా, నరైల్ జిల్లాలోని ఒక గ్రామంలో అవామీ లీగ్ నేతలు, కార్యకర్తల ఆస్తులే లక్ష్యంగా దాడులు జరిగాయి. దుండగులు దాదాపు 30 ఇళ్లకు నిప్పు పెట్టడంతో పాటు పలు ఇళ్లు, దుకాణాలను ధ్వంసం చేసి లూటీ చేసినట్లు స్థానిక మీడియా నివేదించింది. నరైల్ జిల్లా కలియా ఉపజిల్లాలోని బెందార్చార్ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం మొదలైన ఈ దాడులు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. ఈ క్రమంలో దాదాపు 30 ఇళ్లు దగ్ధమవ్వగా, మరికొన్ని ఇళ్లు, దుకాణాలను దుండగులు ధ్వంసం చేసి దోచుకున్నారు.

దాడికి గురైన ఆస్తులలో మాజీ అవామీ లీగ్ ఎంపీ బీఎం కబీరుల్ హక్ ముక్తి, కలియా మున్సిపాలిటీ మాజీ మేయర్ ముష్ఫికుర్ రెహమాన్ లిటన్ మరియు స్థానిక పార్టీ ప్రధాన కార్యదర్శి కృష్ణపద ఘోష్ నివాసాలు ఉన్నాయి. దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా రాజకీయ హింస వ్యాపించడంతో అప్రమత్తమైన అధికారులు, శాంతిభద్రతలను అదుపులోకి తెచ్చేందుకు సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు భద్రతా బలగాలను మోహరించారు.

బంగాళాఖాతంలో మళ్లీ అలజడి!



న్యూస్ డెస్క్, 22 నవంబర్ (ఇది కద నిజం): ఇటీవలే తీరం దాటిన 'అక్వాస్' తుఫాను బలహీనపడి అంతర్గత ఒడిశా మీదుగా అల్పపీడనంగా మారింది. అనంతరం బంగాళాఖాతంలో మరో వాతావరణ మార్పు చోటుచేసుకునే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. నవంబర్ చివరి నాటికి అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతం మీదుగా మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడే సూచనలు ఉన్నాయని ఐఎండీ పేర్కొంది. ఐఎండీ విడుదల చేసిన తాజా రెండు వారాల అంచనా నివేదికలో ఈ కొత్త ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశమున్నట్లు సూచించింది. ఈ సంభావ్య వాతావరణ వ్యవస్థ కచ్చితమైన స్థానం, తీవ్రత, ప్రయాణించే దిశ గురించి ఇప్పుడే ఎలాంటి నిర్దిష్ట అంచనాను విడుదల చేయలేదని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు.

దీనిపై ఇప్పుడే పూర్తి వివరాలు అంచనా వేయడం తొందరపాటు అవుతుందని, ప్రజలు వాతావరణ శాఖ విడుదల చేసే తదుపరి బులెటిన్‌లను నిశితంగా గమనిస్తూ ఉండాలని ఆయన సూచించారు. సాధారణంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య బంగాళాఖాతంలో నాలుగు నుంచి ఐదు తుఫాన్లు ఏర్పడతాయని, ఈ ఏడాది ఇప్పటికే మూడు తుఫాన్లు ఆంధ్రప్రదేశ్, ఒడిశా తీరాలను తాకాయని మహాపాత్ర గుర్తుచేశారు. ఈ ఏడాది కనిపిస్తున్న వాతావరణ పరిస్థితులు 1987 నాటి బలమైన 'ఎల్ నినో' సంవత్సరంతో చాలా వరకు పోలి ఉన్నాయని, వరుస తుఫాన్లకు ఎల్ నినో ప్రభావం కూడా ఒక కారణం కావచ్చని ఆయన వివరించారు. వరుస తుఫాన్లతో ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిన తీర ప్రాంత ప్రజల్లో ఈ తాజా హెచ్చరిక మరింత ఆందోళన కలిగిస్తోంది.

నగరాలపై అభివృద్ధి అస్త్రం!

మొదటి పేజీ తరువాయి

రుణాల సమీకరణ, భూముల వేలం

భారీ ప్రాజెక్టులకు అవసరమైన నిధుల కోసం బాం డ్ల ద్వారా రూ.9,700 కోట్ల రుణాన్ని సమీకరించే అం శం పరిశీలనలో ఉంది. ఎన్‌డీపీ ద్వారా మరో రూ.3 వేల కోట్ల రుణం పొందే ప్రతిపాదన ఉంది. వీటితోపా టు హెచ్‌ఎండీఏ ఆధీనంలోని భూముల వేలం ద్వారా ఆదాయం సమకూర్చుకునే అంశంపైనా దృష్టి సారిస్తున్నారు. ప్రాజెక్టుల అంచనా వ్యయాలు, నిధుల అవసరాలు, రుణ చెల్లింపుల సామర్థ్యాన్ని బేరీజు వేసుకుని ఆర్థిక వనరులను సమకూర్చుకోవాల్సి ఉంది.

మూసీ పునరుజ్జీవనంపై సమీక్ష

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు సమీక్షలో కీలక అం శంగా ఉండనుంది. మొదటి దశ పనులకు సంబంధిం చిన టెండర్ల ప్రక్రియ, రెండో దశకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పన పురోగతిపై చర్చించనున్నారు. ప్రాజెక్టు అమలుకు అవసరమైన కార్యాచరణ, తదుపరి చర్యలపై సమీక్షించే అవకాశం ఉంది. మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టులో ల్యాండ్ పూలింగ్ చట్టానికి సంబంధించిన అంశంపై చర్చించే అవకాశముంది.

పారిశుధ్యం, ట్రాఫిక్ సమస్యలు

కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ అమలు, చెత్త డంపింగ్ యార్డుల సమస్యలు, నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందు లు, హెచ్-సిటీ ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షించనున్నారు. పారిశుధ్య నిర్వహణను మెరుగుపర్చడంతోపాటు ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు చేపట్టనున్న మెట్రో కారిడార్ పనులపై సమీక్షించనున్నారు. దీంతోపాటు హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో రూపొందించిన యూనిఫైడ్ బిల్డింగ్ రూల్స్ అంశం చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది. ఈ అంశంపై సోమవారం సమీక్షలో స్పష్టం వచ్చే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

జల మండలిపై..

ఎల్‌నినో నేపథ్యంలో క్యూర్ పరిధిలో తాగునీ టి సరఫరా, ఎస్టీపీల్లో శుద్ధి చేసిన వాటర్ వినియోగంపై ప్రత్యేకంగా సమీక్షించనున్నారు. ఎస్టీపీల్లో ట్రీట్‌మెంట్‌తోపాటు ప్రయివేటు ఎస్టీపీ ల్లో సైతం ట్రీట్‌మెంట్‌ను పర్యవేక్షించడానికి హైడ్రాకు బాధ్యతలు అప్పగించారు. దీంతోపాటు గోదావరి నుంచి అదనపు జలాలను తరలించే ప్రక్రియలో ట్రయల్ రన్ నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వీటన్నింటిపై సీఎం సమీక్షించనున్నారు. చెరువుల సుందరీకరణ, నీటి సంరక్షణ వంటి అంశాలపై హైడ్రా చేపట్టిన కార్యక్రమాలపై సమీక్షించే అవకాశాలు ఉన్నాయి. హైడ్రా పోలీసు స్టేషన్ కార్యకలాపాల ప్రారంభంపై స్పష్టత వచ్చే అవకాశముంది.

మరో చెరువు పునరుద్ధరణకు హైడ్రా శ్రీకారం!



న్యూస్ డెస్క్, 22 నవంబర్ (ఇది కద నిజం): హైదరాబాద్‌లోని కృష్ణకాంత్ పార్కు చెరువు పునరుద్ధరణపై హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పార్కులో దాదాపు గంటపాటు మార్నింగ్ వాకింగ్ చేస్తూ వాకర్స్, సందర్శకులతో ముఖాముఖి మాట్లాడి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి పరిరక్షణతో పాటు చెరువు, పార్కు సమగ్ర అభివృద్ధిపై వారి నుంచి పలు సూచనలు స్వీకరించారు.

ప్రస్తుతం 3 ఎకరాలకు మాత్రమే పరిమితమైన కృష్ణకాంత్ పార్కు చెరువును 12 ఎకరాలకు విస్తరిస్తూ పునరుద్ధరించేందుకు హైడ్రా ప్రణాళికలు సిద్ధం చేసింది. చెరువు లోతును పెంచి భారీగా వరదనీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, వరదనీరు నేరుగా చెరువులోకి చేరేలా ఇన్‌లెట్లను అభివృద్ధి చేయనున్నారు. జూబ్లీహిల్స్, వెంకటగిరి ప్రాంతాల నుంచి వచ్చే వరదనీటిని కృష్ణకాంత్ పార్కు చెరువుకు మళ్లించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనివల్ల కృష్ణానగర్, యూసుఫ్‌గూడ, మధురానగర్, శ్రీనివాస్ నగర్, అమీర్‌పేట, మైత్రివనం తదితర లోతట్టు ప్రాంతాలకు వరద ముప్పును గణనీయంగా తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు.

ఈ పర్యటనలో వాకర్స్ పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. పార్కు దక్షిణం వైపు ఉన్న చెత్త డంపింగ్ యార్డు కారణంగా తీవ్ర దుర్వాసన వస్తోందని, అలాగే సరైన ప్రహరీ గోడ లేకపోవడంతో చెత్తాచెదారం పార్కులోకి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పార్కులోని పాడైన జిమ్ పరికరాలను వెంటనే మరమ్మతు చేయాలని కోరారు. తమ్మిడికుంట తరహాలో కృష్ణకాంత్ పార్కులోనూ ఆధునిక ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, చెరువుతో పాటు పార్కును కూడా సమగ్రంగా అభివృద్ధి చేయాలని వాకర్స్ విజ్ఞప్తి చేశారు. నగరంలో హైడ్రా ఇప్పటికే పునరుద్ధరించిన చెరువుల అభివృద్ధి తీరును ఈ సందర్భంగా వాకర్స్ ప్రశంసించారు.

మహా పాదయాత్రతో చరిత్ర సృష్టిస్తాం!

మొదటి పేజీ తరువాయి

ఆ భారాన్ని తగ్గించేందుకు సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసినట్లు కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. గురుద్వారాకు సేవ చేయడం తన అదృష్టమని పేర్కొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో అపోహలు సృష్టిస్తోందని విమర్శించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, ఒకరి పేరుతో రెండు ఓట్లు ఉంటే అదనపు ఓటును తొలగించడం, మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశాలని వివరించారు. విదేశాల నుంచి అక్రమంగా వచ్చి ఓటు హక్కు పొందిన వారిని గుర్తించి తొలగించడంతోపాటు, అర్హులైన భారతీయులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమన్నారు.

ఈ దేశంలో ప్రధాని, ముఖ్యమంత్రి మొదలు సర్పంచ్, ఎమ్మెల్యే, ఎంపీల వరకు ప్రజాప్రతినిధులను ఎన్నుకునే అధికారం భారత పౌరులకు మాత్రమే ఉందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీజేపీని చూసి భయపడుతున్నారని బండి సంజయ్ విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటై బీజేపీని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. బీజేపీని ఎదుర్కొనే శక్తి కాంగ్రెస్‌కు లేదని, తెలంగాణలో అభివృద్ధి జరగాలన్నా, కేంద్ర నిధులు రావాలన్నా బీజేపీతోనే సాధ్యమని ప్రజలు గుర్తించారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఎస్ఐఆర్‌పై ప్రజలకు వాస్తవాలు వివరించేందుకు బీజేపీ జాతీయ నాయకత్వం దేశవ్యాప్తంగా 40 ప్రాంతాల్లో మహా పాదయాత్రలు నిర్వహిస్తోందని కేంద్రమంత్రి బండి సంజయ్ వెల్లడించారు. తెలంగాణలో హైదరాబాద్, కరీంనగర్‌లో ఈ కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన పాదయాత్రకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరయ్యారని గుర్తుచేశారు. కరీంనగర్‌లో ఈనెల 23వ తేదీ (సోమవారం)న జరిగే మహా పాదయాత్రకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ హాజరు అవుతారని చెప్పారు.

ఆయనతోపాటు రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి సునీల్ బన్సల్ సహా పలువురు బీజేపీ అగ్రనేతలు పాల్గొంటారని తెలిపారు. కరీంనగర్ గాంధీ బొమ్మ నుంచి వైశ్యా భవన్, రాజీవ్ చౌక్, టవర్ సర్కిల్, శాస్త్రి రోడ్ మీదుగా కమాన్ చౌరస్తా వరకు యాత్ర సాగనుందని వివరించారు. ప్రజలు, కార్యకర్తలు, నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సిక్కు సమాజంపై తనకు ప్రత్యేక అభిమానం ఉందని బండి సంజయ్ అన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో సిక్కుల పాత్ర చిరస్మరణీయమని.. దేశ సరిహద్దుల్లో సైనికులుగా వారు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. గురునానక్, గురుగోవింద్ సింగ్ బోధించిన మార్గంలో సిక్కులు నిజాయితీగా పనిచేయడం, భగవంతుడిని స్మరించడం, సంపాదించిన దానిని ఇతరులతో పంచుకోవడం వంటి సూత్రాలను పాటిస్తారని చెప్పారు. అయితే తెలంగాణలోని సిక్కు కుటుంబాలు ఇళ్లు, ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నాయని, పిల్లలను చదివించుకోలేని పరిస్థితులు ఉన్నాయని బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు.

సిక్కు సమాజాన్ని రాష్ట్ర పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే సిక్కు సమాజానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పాకిస్థాన్ పంజాబ్‌లోకి డ్రగ్స్ పంపిస్తూ సిక్కు యువతను మత్తుకు బానిసలుగా మార్చేందుకు కుట్రలు చేస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. సిక్కు సమాజాన్ని బలహీనపరిస్తే దేశ భద్రతకు నష్టం కలిగించవచ్చనే ఉద్దేశంతో ఇలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా ప్రతి ఒక్కరూ చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల నిర్మూలన కోసం ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న 'నషా ముక్త్ భారత్' కార్యక్రమానికి అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు.

13 ఏళ్ల తర్వాత కొత్త పీఏసీఎస్‌లు!

మొదటి పేజీ తరువాయి

తాజాగా తీసుకున్న నిర్ణయంతో గ్రామీణ ప్రాంతాల్లో సహకార వ్యవస్థ మరింత విస్తరించనుంది.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన సహకార విధానంలో భాగంగా దేశవ్యాప్తంగా ప్రతి గ్రామంలో సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. వ్యవసాయ రంగానికి అవసరమైన రుణాలు, ఎరువులు, విత్తనాలు, ఇతర సేవలను రైతులకు స్థానికంగానే అందుబాటులోకి తీసుకురావడం ఈ విధానం ప్రధాన ఉద్దేశం. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కూడా కొత్త పీఏసీఎస్‌ల ఏర్పాటుపై దృష్టి సారించింది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 500 సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని తొలుత ప్రతిపాదనలు సిద్ధ

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
సోమవారం 23-11-2026

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న రాష్ట్ర సమాచార కమిషనర్



ఇది కద నిజం ,యాదాద్రి భువనగిరి జిల్లా: ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ పి.వి. శ్రీనివాసరావు ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు సంప్రదాయ రీతిలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేయగా, ఆలయ డిప్యూటీ ఈవో వారికి స్వామి వారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాలను అందజేశారు

నూతన ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్

బి.ఎం. సందీప్‌ను కలిసిన బీర్ల అయిలయ్య



ఇది కద నిజం ,హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు నియోజకవర్గ శాసనసభ్యులు బీర్ల అయిలయ్య నూతనంగా నియమితులైన ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ బి.ఎం. సందీప్ ని గాంధీభవన్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య బి.ఎం. సందీప్ కి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, పార్టీ కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల అమలు, రానున్న రోజుల్లో పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై చర్చించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నాయకత్వంలో రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య తెలిపారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన

తెలంగాణ రక్షణ సేన నేత సర్వేష్ ముదిరాజ్



ఇది కద నిజం ,రాజేంద్రనగర్: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ నీరుడు సర్వేష్ ముదిరాజ్ ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. పోలియో మహమ్మారి లేని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాతర్ల దశరథ్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, స్థానిక నాయకులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి విస్తరణ, ప్రజా సమస్యలపై సీజేపీ వాలంటీర్ల సమావేశం



ఇది కద నిజం ,సంగారెడ్డి: కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో ఆదివారం సంగారెడ్డిలోని హరితహారంలో సంగారెడ్డి, మెదక్ జిల్లాల వాలంటీర్ల సంయుక్త సమావేశం జరిగింది. రాష్ట్ర కోఆర్డినేటర్లు రాజేష్ కొరపాక, సమోలు, స్టీఫెన్ రెడ్డి, కొయ్యాడ నివాస్ గౌడ్ హాజరై, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలను వినడంతో పాటు వారి గొంతుకను బలంగా వినిపించడం వాలంటీర్ల బాధ్యత అని పేర్కొన్నారు. సమావేశంలో స్థానిక వాలంటీర్లు ప్రధానంగా మూడు సమస్యలను ప్రస్తావించారు. సంగారెడ్డి, మెదక్ పారిశ్రామిక ప్రాంతాల్లో నియంత్రణలేని కాలుష్యం వల్ల పర్యావరణానికి, ప్రజారోగ్యానికి తీవ్ర హాని కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, పరిశ్రమల్లో కార్మికులకు ప్రభుత్వ కనీస వేతనాలు అందడం లేదని, ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్ల వంటి మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని సమావేశంలో తీర్మానించారు.

రెండు చుక్కలు చిన్నారుల భవిష్యత్తుకు భరోసా

రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయ కార్యదర్శి సాబాధ విజయ్ కుమార్



ఇది కద నిజం ,హైదర్ గూడ: పల్స్ పోలియో కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదర్ గూడ ప్రభుత్వ పాఠశాలలో అంగన్వాడీ సిబ్బందితో కలిసి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయ కార్యదర్శి సాబాధ విజయ్ కుమార్ మాట్లాడుతూ నేడు చిన్నారులకు వేయించే రెండు పోలియో చుక్కలు వారి నిండు జీవితానికి వెలుగునిస్తాయని పేర్కొన్నారు. పోలియో రహిత భారతదేశ నిర్మాణానికి తల్లిదండ్రులందరూ బాధ్యతగా తమ పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది రాణి, బీజేవైఎం రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ కుక్కునూరి కిరణ్ చారి, బీజేపీ క్రియాశీల సభ్యురాలు సాబాధ స్వప్న, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని చిన్నారులకు టీకాలు వేయించారు.

కార్తీక మాసం రెండవ ఆదివారం యాదగిరిగుట్టకు పోటెత్తిన భక్తులు

- 80,400 మందికి స్వామివారి దర్శనం
- భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు



ఇది కద నిజం ,యాదగిరిగుట్ట: కార్తీక మాసం రెండవ ఆదివారం సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దివ్యక్షేత్రానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కార్తీక పౌర్ణమిని తలపించే విధంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఈరోజు మొత్తం 80,400 మంది భక్తులు శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. కార్తీక మాస వ్రతాలను ఆచరించేందుకు కూడా భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బ్యాచ్‌లతో సంబంధం లేకుండా ఎప్పటికప్పుడు వ్రతాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేపట్టారు.

దర్శనాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మధ్యాహ్నం వీఐపి దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేసి, లఘు దర్శనాలను ఏర్పాటు చేసి సామాన్య భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించేలా చర్యలు చేపట్టారు. ఈరోజు మొత్తం 1,328 మంది భక్తులు బ్రేక్ దర్శనం ద్వారా, 9,585 మంది భక్తులు ప్రత్యేక దర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో ప్రత్యేక దర్శనం ద్వారా మధ్యాహ్నం వరకు 5,185 మంది, మధ్యాహ్నం అనంతరం సుమారు 4,400 మంది దర్శనం చేసుకున్నారు. మిగిలిన 69,487 మంది భక్తులు ధర్మదర్శనం ద్వారా శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. ధర్మదర్శనం క్యూలైన్లలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మధ్యాహ్నం అనంతరం 150 ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా ధర్మదర్శనం భక్తులను కూడా ప్రత్యేక క్యూలైన్లలో పంపించేలా చర్యలు చేపట్టారు. దీంతో క్యూలైన్లలో వేచి ఉండే సమయం గణనీయంగా తగ్గి భక్తులకు త్వరితగతిన దర్శనం లభించింది. మధ్యాహ్నం అనంతరం కార్యనిర్వహణాధికారి స్వయంగా దర్శన క్యూలైన్లతో పాటు ఆలయ పరిసరాలను సుదీర్ఘంగా పరిశీలించి, క్యూలైన్ల కదలికలను పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శన ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.

కార్తీక దీపాలతో ఆధ్యాత్మిక శోభ

శ్రీ స్వామివారి దర్శనార్థం విచ్చేసిన భక్తులు ఆలయ మాడవీధుల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్తీక దీపాల వద్ద, అదేవిధంగా శివాలయం సమీపంలోని కార్తీక దీపాల ప్రాంగణంలో దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో ఆలయ మాడవీధులన్నీ నరసింహ నామస్మరణతో మార్మోగుతూ భక్తి పారవశ్యంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఎటుచూసినా కార్తీక దీపాల వెలుగులు, భక్తుల నామస్మరణలతో యాదగిరిగుట్ట క్షేత్రం ఆధ్యాత్మిక వాతావరణంతో అలరారింది.



కార్తీకోత్సవాల్లో ఆధ్యాత్మిక నృత్య ప్రదర్శనలు

దేవస్థానంలో నిర్వహిస్తున్న కార్తీకోత్సవాల్లో భాగంగా మూడవ రోజు పరంపర వారి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక నృత్య ప్రదర్శనలు కొనసాగాయి. భక్తిభావాన్ని పెంపొందించేలా సాగిన ఈ నృత్య ప్రదర్శనలను స్థానికులు, భక్తులు ఆసక్తిగా తిలకించి ఆనందాన్ని వ్యక్తం చేశారు.

కార్తీక పౌర్ణమికి ముందస్తు ఏర్పాట్లు

ఈ నెల 24-11-2026 మంగళవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో పాటు, కార్తీక మాస వ్రతాలను ఆచరించే భక్తుల సంఖ్య కూడా అధికంగా ఉండే అవకాశం ఉన్నందున దేవస్థానం అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఈరోజు భక్తుల రద్దీని ప్రామాణికంగా తీసుకొని, పౌర్ణమి రోజున భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శన, వ్రతాలు, క్యూలైన్లు, కార్తీక దీపాల ఏర్పాట్లు తదితర



అంశాలపై ముందస్తు ప్రణాళికతో అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిరంతర పర్యవేక్షణతో దర్శన, వ్రత ఏర్పాట్లు చేపట్టి ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు దేవస్థానం ప్రత్యేక చర్యలు కొనసాగిస్తోంది.

మదనపల్లి మున్సిపాలిటీలో ఎస్సీ, ఎస్టీలకు వైస్ చైర్మన్ పదవి కేటాయించాలి: బహుజన సేన



ఇది కద నిజం ,మదనపల్లి: మదనపల్లి మున్సిపాలిటీలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు వైస్ చైర్మన్ పదవిని కేటాయించి సామాజిక న్యాయం చేయాలని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ చందు కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మదనపల్లిలో ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, పదవుల కేటాయింపులో కేవలం రాజకీయ సమీకరణాలకే కాకుండా సామాజిక సమీకరణాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నేటి వరకు మదనపల్లి మున్సిపాలిటీ చరిత్రలో ఎస్సీ, ఎస్టీలకు అధికారంలో భాగస్వామ్యం కల్పించిన దాఖలాలు లేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

1961లో మదనపల్లి మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన పరిణామాలను శ్రీ చందు వివరిస్తూ, గత 65 ఏళ్ల చరిత్రలో తొమ్మిది మంది చైర్మన్లుగా పనిచేశారని పేర్కొన్నారు. 1961 నుంచి 2026 వరకు పనిచేసిన రాటకొండ రెడ్డప్ప నాయుడు, జీవీ సుబ్బారెడ్డి, రాటకొండ రాజశేఖర్, గుండ్లూరు ముజీబు హుస్సేన్, బి. నరేష్ కుమార్ రెడ్డి, డాక్టర్ ఎన్. రవికుమార్, శ్రీమతి మనోజ రెడ్డి వంటి ఏడుగురు ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారు కాగా, కొడవలి శివప్రసాద్, ప్రస్తుత చైర్మన్ శ్రీరామ్ చినబాబు ఇద్దరు మాత్రమే బీసీ సామాజిక వర్గం నుంచి ఎన్నికయ్యారని తెలిపారు. ఈ మొత్తం కాలంలో ఎక్కడా కూడా వైస్ చైర్మన్ పదవుల్లో సైతం ఎస్సీ, ఎస్టీలకు అవకాశం దక్కలేదని, ఎవరైనా అధికారిక రికార్డులను పరిశీలించుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న కూటమి ప్రభుత్వం, ప్రస్తుతం సామాజిక కోణంలో పదవులు ఎవరికి ఇవ్వాలన్నది కనీసం బేరీజు వేసుకోకపోవడం విచారకరమని శ్రీ చందు అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి, సామాజిక సమీకరణాల ఆధారంగా ఎస్సీ, ఎస్టీలకు వైస్ చైర్మన్ పదవిని కేటాయించి తమ వర్గ ప్రజలకు తగు న్యాయం చేయాలని కోరారు. ఒకవేళ ఈసారి కూడా మున్సిపల్ పాలకవర్గంలో భాగస్వామ్యం కల్పించకపోతే, ఎస్సీ, ఎస్టీలను అధికారానికి దూరంగా పెట్టారన్న అపవాదును కూటమి ప్రభుత్వం కచ్చితంగా మోయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

వెంకట సాయి నగర్ కాలనీలో పల్స్ పోలియో కార్యక్రమం

403 మంది చిన్నారులకు పోలియో చుక్కలు



ఇది కద నిజం ,రామంతాపూర్ భగాయత్, నవంబర్ 22: రామంతాపూర్ భగాయత్‌లోని వెంకట సాయి నగర్ కాలనీలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐదేళ్లలోపు 403 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణతో పాటు పోలియో వ్యాధి నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా కాలనీలో పోలియో చుక్కలు వేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ బి. రామదేవి చిన్నారులకు పోలియో చుక్కలు వేయగా, ఆశా వర్కర్ రాధిక కార్యక్రమ నిర్వహణలో సహకరించారు. విద్యార్థులు సైతం కార్యక్రమంలో పాల్గొన్నారు. కాలనీలోని తల్లిదండ్రులు తమ చిన్నారులను పల్స్ పోలియో కేంద్రానికి తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ బి. రామదేవి మాట్లాడుతూ, ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని, పోలియో వ్యాధి నుంచి పిల్లలకు రక్షణ కల్పించేందుకు తల్లిదండ్రులు బాధ్యతగా ముందుకు రావాలని సూచించారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో నిర్మూలనకు సహకరించాలని, పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె కోరారు.

(ఎల్ టా)ఆధ్వర్యంలో మండల స్థాయి ఇంగ్లీష్ భాషా పోటీలు





(ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో మండల స్థాయి ఇంగ్లీష్ భాషా పోటీలను తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంచాల పాఠశాలలో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ పోటీలలో మంచాల మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ఆంగ్ల భాషా నైపుణ్యాలను, ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారు. విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై ఆసక్తిని పెంపొందించడం, మాట్లాడటం, చదవడం, రాయడం వంటి భాషా నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ఈ పోటీల ముఖ్య ఉద్దేశ్యం.ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి రామదాస్, మంచాల పబ్లిక్ స్కూల్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఝాన్సీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.మంచాల మండల అధ్యక్షులు డాక్టర్ అజ్మత్ ఖాన్ హాజరయ్యారు. మండలంలోని వివిధ పాఠశాలల ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి రామ్ దాస్ మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆంగ్ల భాషా నైపుణ్యాలు ఎంతో అవసరమని, విద్యార్థులు ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడంతో పాటు తమ భావాలను ఆంగ్లంలో ధైర్యంగా వ్యక్తపరచగలరని తెలిపారు.విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని, భవిష్యత్తులో కూడా మరిన్ని భాషా సంబంధిత కార్యక్రమాలను నిర్వహించాలని రామ్ దాస్ ఆకాంక్షించారు. (ఎల్ టా) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆంగ్ల భాష పట్ల ఆసక్తిని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో ఒక మంచి ముందడుగుగా నిలిచింది.

ఎల్కతుర్తి పీహెచ్‌సీ పరిధిలో 2,204 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు



హనుమకొండ, ఇది కద నిజం: ఎల్కతుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పి.హెచ్.సీ పరిధిలో ఆదివారం నాడు పల్స్ పోలియో కార్యక్రమం అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది. మండల వ్యాప్తంగా మొత్తం 21 పల్స్ పోలియో బూత్‌లను ఏర్పాటు చేసి, 2,204 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

బూత్‌ల వద్ద పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన పిల్లల కోసం సోమ, మంగళవారాల్లో (రేపు మరియు ఎల్లుండి) వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి, ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయనున్నట్లు వైద్యాధికారి తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, ఫార్మసిస్ట్, ఏఎన్ఎంలు , ఆశా వర్కర్లు (జంపాల రాధిక తదితరులు) మరియు వాలంటీర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం





ఓటీటీలోకి త్రివిక్రమ్-వెంకీ మూవీ!

మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, విక్టరీ వెంకటేష్ కాంబినేషన్‌లో తెరకెక్కిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం'. ఈ సినిమాలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటించగా, నివేదా పేతురాజ్, డింపుల్ హయాతీ, నారా రోహిత్, రావు రమేష్, నాజర్, సత్య, బ్రహ్మాజీ కీలక పాత్రల్లో కనిపించారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు. అక్టోబర్ 30న థియేటర్లలో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది.

థియేటర్లలో నిరాశపరిచిన 'ఆదర్శ కుటుంబం' ఇప్పుడు ఓటీటీ స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. నవంబర్ 27 నుంచి ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. దీనికి సంబంధించిన పోస్టులు కూడా నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. అయితే, నవంబర్ 27న స్ట్రీమింగ్ అవుతుందన్న వార్తలపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

సంక్రాంతి విందుకు సిద్ధం అవ్వండి



టాలీవుడ్ టాలెంటెడ్ హీరో శ్రీ విష్ణు మరోసారి ప్రేక్షకులను నవ్వించేందుకు సిద్ధమవుతున్నారు. 'సామజవరగమన' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత హీరో శ్రీ విష్ణు, దర్శకుడు రామ్ అబ్బరాజు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఫ్యామిలీ ప్యాక్'. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది. ఫన్, కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇదిలా ఉంటే, తాజాగా మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమా టీజర్‌ను నవంబర్ 23న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అంతేకాదు, 2027 సంక్రాంతికి సినిమాను థియేటర్లలోకి తీసుకురానున్నట్లు మరోసారి స్పష్టం చేశారు. కాగా.. ఇందులో శ్రీ విష్ణు సరసన సాక్షి మదోల్కర్ కథానాయికగా నటిస్తున్నారు. అభిరామి, నరేష్, మురళీ శర్మ, వెన్నెల కిషోర్, నెల్లూరు సుదర్శన్, ఆదిత్య చెంబోలు తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. భాను భోగవరపు, నందు సావిరిగాన కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందిస్తుండగా, చైతన్ భరద్వాజ్ సంగీతం సమకూరుస్తున్నారు.

వాయిదా లేదు



'వృషకర్మ' సినిమా విడుదల వాయిదా పడుతుందంటూ వస్తున్న ఊహాగానాలకు చిత్ర యూనిట్ తెరదించింది. సినిమా రిలీజ్ విషయంలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేసింది. ముందుగా ప్రకటించినట్టుగానే డిసెంబర్ 4న చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు కన్ఫర్మ్ చేసింది. ఈ మేరకు ట్రైలర్ విడుదల తేదీని కూడా ప్రకటిస్తూ.. ఓ పోస్టర్ వదిలింది. ఈ పోస్టర్ నెట్టింట వైరల్ అయింది.

నవంబర్ 25న భారీ ఈవెంట్ నిర్వహించి వృషకర్మ ట్రైలర్‌ను గ్రాండ్‌గా విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే సినిమా ఫైనల్ ఎడిట్ కూడా లాక్ అయినట్లు సమాచారం. దీంతో డిసెంబర్ 4న సినిమా విడుదల కావడం ఖాయమని చిత్ర బృందం స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. ఈ ఏడాది ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో వృషకర్మ ఒకటి. విరూపాక్షతో దర్శకుడు కార్తీక్ వర్మ దండు, తండేల్‌తో హీరో నాగచైతన్య వంద కోట్లు కొల్లగొట్టడంతో ఈ సినిమాపై అంచనాలు పెరిగాయి. ఈ మైథలాజికల్ అడ్వెంచర్ థ్రిల్లర్‌లో చై సరసన మీనాక్షి చౌదరి నటించారు. స్పర్శ్ శ్రీవాస్తవ, జయరామ్, సత్య, జరీనా వాహబ్, దయానంద్ రెడ్డి కీలక పాత్రలు చేశారు.

'మైసా' రిలీజ్ వాయిదా



నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మైసా' విడుదల వాయిదా పడింది. ఈ చిత్రాన్ని తొలుత నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయాలని చిత్రబృందం నిర్ణయించింది. అయితే, తాజాగా ఈ విడుదల తేదీని వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించారు.

'మైసా' ప్రపంచాన్ని ఎటువంటి రాజీ లేకుండా అత్యుత్తమ నాణ్యతతో, సినిమాకు తగిన గొప్ప అనుభూతిని ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ దార్శనికతతో నవంబర్ 27న జరగాల్సిన థియేట్రికల్ రిలీజ్‌ను వాయిదా వేస్తున్నామని, కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని స్పష్టం చేసింది. కొత్త రిలీజ్ డేట్ వచ్చేలోపు అభిమానులు ఆ ఉత్సాహాన్ని అలాగే కొనసాగిస్తూ, చిత్రంలోని జోష్ నింపే 'ఓసే రాములమ్మ' పాటను ఆస్వాదించాలని మేకర్స్ కోరారు. రవీంద్ర పుల్లే దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌ను అన్‌ఫార్ములా ఫిల్మ్స్, టీ-సిరీస్ సౌత్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. వాయిదా వార్తతో అభిమానులు కొంత నిరాశకు గురైనప్పటికీ, నాణ్యత విషయంలో రాజీ పడకుండా సినిమాను తీసుకువస్తున్నారన్న అంశం పట్ల ఆసక్తి వ్యక్తం చేస్తున్నారు.

బాలయ్య షోకు మెగాస్టార్



నందమూరి బాలకృష్ణ హోస్ట్‌గా వ్యవహరించిన 'అన్‌స్టాపబుల్ విత్ చీదీఖ' టాక్ షో తెలుగు ప్రేక్షకుల్లో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. స్టార్ హీరోలు, దర్శకులు, నిర్మాతలను తనదైన శైలిలో ప్రశ్నిస్తూ.. పంచులు, చమత్కారాలతో బాలయ్య చేసిన సందడి ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఇప్పటికే నాలుగు సీజన్లతో విజయవంతమైన ఈ షోకు కొంతకాలంగా బ్రేక్ పడింది. అయితే ఇప్పుడు మరోసారి బాలకృష్ణ 'అన్‌స్టాపబుల్' సీజన్ 5తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అంతేకాదు, ఈ కొత్త సీజన్ తొలి ఎపిసోడ్‌కు మెగాస్టార్ చిరంజీవి గెస్ట్‌గా హాజరుకానున్నారనే ప్రచారం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. బాలకృష్ణ హోస్ట్‌గా వ్యవహరించిన అన్‌స్టాపబుల్ టాక్ షో ఆహా ఓటీటీ వేదికగా మంచి విజయాన్ని సాధించింది. ఈ షోలో బాలయ్య తనదైన ప్రశ్నలతో సెలబ్రిటీలను ఇబ్బంది పెట్టడం, వారి వ్యక్తిగత జీవితాల్లోని ఆసక్తికర విషయాలను బయటకు తీసుకురావడం, సరదా సంభాషణలతో ప్రేక్షకులను నవ్వించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా స్టార్ హీరోలు, రాజకీయ ప్రముఖులు, దర్శకులు ఈ షోకు హాజరై తమ కెరీర్, వ్యక్తిగత జీవితం, వివాదాలు, అనుభవాల గురించి మాట్లాడటంతో ప్రతి ఎపిసోడ్‌కు మంచి ఆదరణ లభించింది. నాలుగు సీజన్ల పాటు ప్రేక్షకులను అలరించిన ఈ కార్యక్రమానికి ఇప్పుడు మరో సీజన్ తీసుకురావాలని నిర్వాహకులు భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సీజన్ 5 కోసం ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, త్వరలోనే షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

అన్‌స్టాపబుల్ సీజన్ 5పై వస్తున్న వార్తల్లో అత్యంత ఆసక్తికరమైన అంశం చిరంజీవి గెస్ట్‌గా హాజరుకానున్నారనే ప్రచారం. బాలకృష్ణ, చిరంజీవి ఇద్దరూ తెలుగు సినీ పరిశ్రమలో అగ్రస్థానంలో ఉన్న స్టార్ హీరోలు. వీరిద్దరూ ఒకే వేదికపై కనిపిస్తే అభిమానులకు అది ప్రత్యేకమైన ఎపిసోడ్‌గా నిలిచే అవకాశం ఉంది. ఇప్పటికే బాలయ్య, చిరంజీవి మధ్య స్నేహపూర్వక సంబంధాలు, ఒకరిపై మరొకరు గౌరవం వ్యక్తం చేసిన సందర్భాలు అభిమానుల్లో మంచి స్పందన తెచ్చుకున్నాయి. అలాంటి ఇద్దరు దిగ్గజాలు టాక్ షో వేదికపై కలిసి కనిపిస్తే.. వారి సంభాషణలు, పాత జ్ఞాపకాలు, సినీ ప్రయాణం, ఆసక్తికర ప్రశ్నలు ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందిస్తాయని భావిస్తున్నారు. మరోవైపు మెగాస్టార్ చిరంజీవి కూడా ఓటీటీ రంగంలో టాక్ షోతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా చిరంజీవి చేస్తున్న 'మెగా వర్స్' టాక్ షో గురించి ఇప్పటికే వార్తలు వెలువడ్డాయి. ఈ కార్యక్రమానికి సంబంధించిన కొన్ని ఎపిసోడ్ల షూటింగ్ కూడా పూర్తయినట్లు సమాచారం. త్వరలోనే ఈ షో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది.

జబర్దస్త్ కమెడియన్లకు రోడ్డు ప్రమాదం!

ప్రముఖ కామెడీ షో 'జబర్దస్త్' ఆర్టిస్టులు దొరబాబు, రైజింగ్ రాజు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సమీపంలోని పాలకోడేరు మండలం గోరగనమూడి వద్ద అర్ధరాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కాకినాడలో జనసేన అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం ముగించుకుని తిరిగి వస్తుండగా వీరు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. వివరాల్లోకి వెళితే, గోరగనమూడి వద్దకు రాగానే దొరబాబు ప్రయాణిస్తున్న కారు అకస్మాత్తుగా అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ప్రమాద సమయంలో కారులో ఉన్న దొరబాబు, రైజింగ్ రాజులకు గాయాలు కాగా, కారు నడుపుతున్న డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. కారులో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీసి హుటాహుటిన భీమవరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పాలకోడేరు పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

అతివేగమా లేక నిద్రమత్తు కారణమా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. తమ అభిమాన కమెడియన్లకు ప్రమాదం జరిగిందని తెలియడంతో జబర్దస్త్ అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తూ, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

